క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కలకడ : మండలంలోని గంగాపురం, ఎర్రకోట పల్లె, గుడిబండ క్లస్టర్ల పరిధిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతులు, విద్యుత్ లైన్ పునరుద్ధరణ, లైన్‌పై తీగల తొలగింపు వంటి పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. రైతులు, ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

హుండీ చోరీ కేసులో నిందితుడికి జైలు

బి.కొత్తకోట: చోరీ కేసులో నిందితుడికి ఆరు నెలలు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు వెల్లడించినట్లు ఎస్‌ఐ రామ్మోహన్ శుక్రవారం తెలిపారు. 2022 అక్టోబరులో ములకలచెరువుకు చెందిన ఆదినారాయణ బయప్పగారిపల్లె గ్రామం మొగసాలమర్రిలోని ఓ ఆలయంలో హుండీని అపహరించి రూ.4500 నగదు చోరీ చేశాడు. గ్రామస్థుల ఫిర్యాదుతో అప్పట్లో అతన్ని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. మదనపల్లె ఫస్ట్ ఏడీజే కోర్టు జడ్జి ఆసీఫా సుల్తానా కేసు విచారించి ఆరునెలల జైలు, రూ. 1500 జరిమానా విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎర్రబల్లె గ్రామంలో పల్లెబాట

కురబలకోట: మండలంలోని ఎర్రబల్లె గ్రామంలో శుక్రవారం గ్రామ సర్పంచ్ నాగరత్న, గ్రామ ఇన్‌చార్జి ఈశ్వర్ ఆధ్వర్యంలో పల్లె బాట కార్యక్రమం జోరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ బైసాని జ్యోతి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు బైసాని చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ బి.దస్తగిరి సింగన్నగారిపల్లె, బలకవారిపల్లె, చెన్నామర్రి గ్రామాలకు రూ.2.60 కోట్లతో వేసిన తారు రోడ్లను ప్రారంభించారు. రూ.21 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్‌ను కూడా ప్రారంభించారు. ఎలాంటి సమస్య ఉన్నా పరిష్కరిస్తామని నాయకులు తెలిపారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

పెద్దతిప్పసముద్రం: పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యంగా ఉండవచ్చని మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు ప్రజలకు సూచించారు. డ్రైడే, ఫ్రైడే సందర్భంగా మండలంలోని మద్దయ్యగారిపల్లి పంచాయతీలో పర్యటించారు. నివాస గృహాల ఎదుట ఉన్న నీటి డ్రమ్ములు, రోడ్లపై ప్రవహించే మురుగ నీటి నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం ఆహారపు నియమాలు, ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రతలను వివరించారు. దోమల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, పాల్గొన్నారు.

మారెమ్మ విగ్రహ ప్రతిష్ట

కురబలకోట: మండలంలోని మొలకవారిపల్లెలో పునర్నిర్మాణ మారెమ్మ ఆలయంలో శని, ఆదివారాల్లో నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. శనివారం విగ్రహ జలదివాసం, తీర్థ ప్రసాదాలు, ఆదివారం విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ, హోమంతోపాటు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

17న ఉచిత వివాహ పరిచయ వేదిక

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం చెంబకూరు రోడ్డులోని భగవాన్ సత్యసాయి సేవాసమితి మందిరంలో ఈనెల 17న ఉచిత బలిజ వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు జీ.వీ.రమణ తెలిపారు. పెళ్లికాని బలిజ యువతి,యువకులు పెళ్లి సంబంధాలు ఉచితంగా చేసుకోవచ్చునన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందన్నారు. హాజరయ్యేవారు కార్డు సైజు ఫోటోలతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 9110538241ను సంప్రదించాలన్నారు.

సమష్టిగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

తంబళ్లపల్లె: ప్రభుత్వం అమలు పరుస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ సర్వేను వైద్య సిబ్బంది, వాలంటీర్లు సమష్టిగా నిర్వహించాలని మెడికల్ ఆఫీసర్ అనుపమ కోరారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో వైద్య సిబ్బందికి జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈనెల 12వ తేదీ నుంచి ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, వాలంటీర్ల సహకారంతో ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించాలన్నారు. పిల్లల నుండి పెద్దలు, వృద్ధుల ఆరోగ్య పరిస్థితులపై నివేదికలు రూపొందించాలన్నారు. అనంతరం మెడికల్ క్యాంపు నిర్వహించి వైద్యం అందిస్తామన్నారు. సమావేశంలో ఎంపీడీఓ సురేందనాథ్, ఎంఈఓ త్యాగరాజు తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

పెద్దతిప్పసముద్రం: అంగన్‌వాడీల్లో ప్రభుత్వం ద్వారా అందజేసే పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జెడ్పీటీసీ శివన్న, వైస్ ఎంపీపీ శోభా, పట్టెరిక శంకర్ సూచించారు. శుక్రవారం మండలంలోని కందుకూరు అంగన్‌వాడీ క్లస్టర్ పరిధిలో పోషణ మాసోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరత్నమ్మ గర్భవతులు, బాలింతలతో పాటు చిన్నారుల ఆరోగ్యంపై పలు సూచనలు ఇచ్చారు. వైఎస్సార్ పోషణా కిట్లను అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జనం మెచ్చేలా జగనన్న సంక్షేమ పాలన

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కేవీపల్లె : జనం మెచ్చేలా జగనన్న సంక్షేమ పాలన అందిస్తున్నారని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కేవీపల్లె గ్రామ సచివాలయం-2 పరిధిలోని శిబ్యాలవారిపల్లె, హరిజనవాడ, కలకటవారిపల్లె, యర్రజేనుపల్లె, బండవడ్డిపల్లె, మూలవడ్డిపల్లె, మర్రిపాటివారిపల్లె తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. ప్రభుత్వం నుంచి అందిన సంక్షేమ పథకాలు చదివి వినిపించడం తోపాటు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. శిబ్యాలవారిపల్లెలో కొత్తగా అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరడంతో ప్రతిపాదనలు పంపుతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. దళితుల సమస్యలపై అధికారులు ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించాలని హరిజనవాడ గ్రామస్తులు కోరారు. గ్రామంలో విద్యుత్ వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరడంతో స్పందించిన ఎమ్మెల్యే సత్వరం సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కలకటవారిపల్లెలో కొత్తగా సిమెంట్ రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఎన్నికల హామీల్లో భాగంగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి దాదాపు వందశాతం హామీలు అమలు చేశారని తెలిపారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించాలనే తపనతో సరికొత్త పథకాలు తీసుకొచ్చారని చెప్పారు. అన్ని వర్గాలను ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. నిరంతరం ప్రజల సంక్షేమం కోసం పాటుపడే ముఖ్యమంత్రిని మరోసారి ప్రజలు నిండు మనస్సుతో ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఈశ్వరమ్మ, జెడ్పీటీసీ గజ్జెల శృతి, వైస్ ఎంపీపీ వెంకటరమణారెడ్డి, నాయకులు గజ్జెల శీన్‌రెడ్డి, సి.కె. యర్రమరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, చిన్నయర్రమరెడ్డి, హరినాథరెడ్డి, కృష్ణయ్య, దినేష్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, రామకొండారెడ్డి, సైపుల్లాఖాన్, రవీంద్రరెడ్డి, రమేష్, అప్పిరెడ్డి, రమణ, వెంకటసిద్ధు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం

వాల్మీకిపురం: మండలంలోని చింతపర్తికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఓరుగంటి రమేష్ కుమారుడు హర్షవర్ధన్ వివాహ వేడుక శుక్రవారం మదనపల్లిలోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించారు. వివాహ వేడుకకు పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఎండీసీ డైరెక్టర్ హరీష్ రెడ్డిలు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

నేడు ఉచిత గుండెజబ్బుల వైద్య శిబిరం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : పట్టణంలోని జెడ్పీ హైస్కూల్‌లో శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైదేహి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, రీసెర్చ్‌సెంటర్, బెంగళూరు వారి ఆధ్వర్యంలో ఉచిత గుండె జబ్బుల వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే నవాజ్‌బాషా తెలిపారు. శుక్రవారం వైద్య శిబిరానికి సంబంధించిన ఏర్పాట్లను డీఎస్పీ కేశప్ప, మున్సిపల్ డీఈ బండపల్లిశిరీషా, వైదేహి హాస్పిటల్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. నిర్వహణపై పలు సూచనలిచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ...డాక్టర్.వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం, ఈహెచ్ఎస్ స్కీముకు అర్హులైన కార్డియాలజీ రోగులకు హెల్త్ క్యాంపులో ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహిస్తామన్నారు. హెల్త్ క్యాంపునకు హాజరైన వారికి బ్లడ్ ప్రెజర్, ఈసీజీ, 2డి ఎకో పరీక్షలతో పాటుగా కార్డియాలజిస్ట్ కన్సల్టేషన్ సేవలను ఉచితంగా అందిస్తామన్నారు. అలాగే శిబిరానికి హాజరయ్యే వారికి భోజనవసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో గుండె జబ్బులతో బాధపడుతున్నవారు, ముందస్తు పరీక్షలు చేయించుకోదలచిన వారు శిబిరానికి హాజరై వైద్యసేవలను పొందాలన్నారు. ముందుగా వచ్చిన వారికి టోకెన్లు జారీచేసి వైద్యపరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు ఉచిత గుండె వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ డైరెక్టర్ తట్టిశ్రీనివాసులురెడ్డి, ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, చందూరెడ్డి, దండు కరుణాకర్ రెడ్డి, గౌడసాని వెంకటరమణ, బావాజాన్, కౌన్సిలర్ వసీం తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి

వాల్మీకిపురం: ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలని డీపీఎంఓ డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులను రెఫర్ చేయకుండా ఇక్కడే వారికి మెరుగైన వైద్యం అందించాలన్నారు. అలాగే ప్రభుత్వాసుపత్రిలో కాన్పుల సంఖ్య పెంచాలని, ఈసీజీ, ఎక్స్‌రే, రక్తపరీక్షలు తదితర పరీక్షలు నిర్వహించాలని సూచించారు. అనంతరం సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఫైరోజా బేగం, సిబ్బంది పాల్గొన్నారు.

శివపార్వతుల కల్యాణం


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పెద్దతిప్పసముద్రం : శ్రావణ శుక్రవారం సందర్భంగా స్థానిక పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో శివ పార్వతుల కల్యాణోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శివాలయం సేవకులు సనగరం పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో ఆలయంలో కలశ స్థాపన, లక్ష్మీ అమ్మవారికి పంచామృతాభిషేకం, శ్రీసూక్త, దుర్గా సూక్త పునశ్చరణ హోమం, గణపతి హోమం, పూర్ణాహుతి, శివునికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, మహా మంగళహారతి నిర్వహించారు. అలాగే సాయంకాలం ప్రత్యేక పుష్పాలతో అలంకరించిన శివ, పార్వతుల కళ్యాణోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

ప్రతి గడపలో సంక్షేమ కాంతులు

పెద్దతిప్పసముద్రం: అవ్వ..తాతా..బాగున్నావారా.. వలంటీర్లు ఇంటికి వచ్చి పింఛన్ సొమ్ము ఇస్తున్నారా, జగనన్న పాలన ఎలా ఉంది అంటూ ఆప్యాయంగా పలకరిస్తూ ప్రజా ప్రతినిధులు పల్లెబాట కొనసాగించారు. శుక్రవారం ఎంపీపీ మహమూద్, కన్వీనర్ సుబ్బరాం,జెడ్పీటీసీ శివన్న, జేసీఎస్ కన్వీనర్ డ్రిప్ రమణలు మండల స్థాయి అధికారులతో కలసి మండలంలోని కందుకూరు పంచాయతీలో పల్లెబాట నిర్వహించారు. రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల ప్రజలను నమ్మించి మోసం చేసిన ఘనత చంద్రబాబుదేనన్నారు. గత నాలుగున్నరేళ్ళ పాలనలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల లబ్ధిని క్షుణంగా తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి చేసిన అభివృద్ధి పనులను వివరిస్తూ ప్రజా సమస్యలను తెలుసుకొని పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టారు. ప్రజారంజకమైన పాలన అందిస్తున్న జగనన్నను ప్రజలంతా మళ్ళీ ఆశీర్వదించాలని కోరారు. టీడీపీ పాలనలో సంక్షేమ పథకాలు మంజూరు కావాలంటే ప్రజలు నిత్యం ప్రభుత్వ కార్యాలయాలు, జన్మభూమి కమిటీ సభ్యుల చుట్టూ ప్రదక్షిణలు చేసేవారని, వైఎస్సార్‌సీపీ పాలనలో అర్హతే ప్రామాణికంగా వలంటీర్లే ఇళ్ళ వద్దకు వచ్చి పథకాలను అందిస్తున్నారన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాలను ఆవిష్కరించారు. ఎంపీడీఓ గిరిధర్‌రెడ్డి, తహసీల్దార్ విద్యాసాగర్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు రహ్మతుల్లా, కేశవ్, పట్టెరిక శంకర్, పాలశీనా, గణపతిరెడ్డి, వెంకట్, శంకర్, గట్టు శీనా, పాలశీనా, హిద్దీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి

పీలేరు : ఈ నెల 18 నిర్వహించనున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీవర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. శుక్రవారం స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో జరిగిన వివిధ ప్రజా సంఘాల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఎస్సీవర్గీకరణ బిల్లుకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతివ్వాలన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీని నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ వివిధ సంఘాల నాయకులు కె.ఎస్.రాజుమాది, గండికోట వెంకటేష్, యర్రయ్య, సురేష్, రామ్మూర్తి, ఆంజినేయులు, హుస్సేన్, భాస్కర, చందు, కార్తీక్, గంగాధర, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చడమే ధ్యేయం


ఇంటి పట్టా అందజేస్తున్న ఎంపీపీ శ్రీదేవి

కలకడ : గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని నిరుపేదల సొంతింటి కల నెరవేర్చడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయం అని ఎంపీపీ శ్రీదేవి, ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని కె.బాటవారిపల్లె పంచాయతీ లబ్ధిదారులకు ప్రభుత్వ భూమిలో మంజూరు చేసిన ఇంటిపట్టాలను పంపిణీ చేశారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం ఇల్లు మంజూరు చేసి జగనన్న కాలనీలలో అన్ని సౌకర్యాలను కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షబానా భాను, ఇంజనీరింగ్ అసిస్టెంట్ చరిస్మాంజలి తదితరులు పాల్గొన్నారు.

వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి


ఎస్‌ఐ గాయత్రి

ములకలచెరువు: వినాయకచవితి పండుగ సందర్భంగా గ్రామాల్లో నెలకోల్పే విగ్రహాలకు పోలీసుల నుంచి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ప్రజలకు ఎస్‌ఐ గాయత్రి సూచించారు. శుక్రవారం ఆమే విలేకర్లతో మాట్లాడుతూ... విగ్రహాల వద్ద డీజేలు ఏర్పాటు చేయరాదని ఆదేశించారు. రాత్రి 10 గంటల తర్వాత వేడుకలు ఆపివేయాలని చెప్పారు. ట్రాఫిక్ అంతరాయం కలిగించి ప్రజలకు ఇబ్బంది కల్పించినా వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మూడు రోజుల్లో నిమజ్జనం పూర్తి చేయాలని పేర్కొన్నారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాలు


కోనేటివారిపల్లెలో సీసీ రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

ములకలచెరువు: రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఎంపీపీ సాయిలీలా, సర్పంచ్ జయచంద్రకుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని కోనేటివారిపల్లె పంచాయతీల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు పల్లెబాట నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నెలకొన్న సీసీ రోడ్లు, మురుగునీటి కాలువలు వేయించాలని పలువురు ప్రజాప్రతినిధులను కోరారు. సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం తలారివారిపల్లి, దాసెట్టివారిపల్లె, ఆంగిడోళ్లపల్లెలో ఏర్పాటు చేసిన సీసీ రోడ్ల శిలాఫలకాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు. అనంతరం కోనేటివారిపల్లెలో వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరించారు. నియోజకవర్గ అభివృద్ధి ఘనత ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి దేనని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు కృష్ణప్ప, అలివేలమ్మ, నాయకులు సదాశివప్ప, ఆముదాల మదుసూదన్‌రెడ్డి, ఉమామహేశ్వర్, రాంబాబు, విశ్వనాథ్, మహల్దార్ అబ్దుల్, చాంద్‌బాషా, శ్రీనివాసులు, రెడ్డిబాషా, అధికారులు పాల్గొన్నారు.

కణికలమ్మకు పచ్చపూజ


పచ్చపూజ కార్యక్రమంలో భక్తులు

తంబళ్లపల్లె: మండలంలోని గోళ్లపల్లెవారిపల్లె సమీప అటవీ ప్రాంతం సరిహద్దులో ఊటచలం వద్ద వెలసిన కణికలమ్మ (అక్కదేవతలు)లకు శుక్రవారం పచ్చపూజ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. పూజారి పసుపులేటి రామచంద్ర అక్కదేవతలు అలంకరించి పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మూడేళ్లకు ఒకసారి కణికలమ్మకు పచ్చపూజ చేయడం ఆనవాయితీగా వస్తోంది. మహిళ భక్తులు ఉపవాసాలతో పచ్చపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

వాల్మీకిపురం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవి అన్నారు. శుక్రవారం స్థానిక పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల స్థాయి స్కూల్ గేమ్స్ సెలక్షన్‌లో 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జూనియర్స్, సీనియర్స్ రెండు విభాగాలు కలిపి 9 క్రీడల్లో ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. కబడ్డీ, వాలీబాల్, టెన్నికాయిట్, అథ్లెటిక్స్ ఈవెంట్లను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు నియోజకవర్గస్థాయిలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటలక్ష్మి, హెచ్‌ఎం సావిత్రి, మండల కోఆర్డినేటర్ ఉషారాణి, పీఈటీలు రెడ్డివరప్రసాద్, రోషన్ జమీర్, లక్ష్మి లలిత, ఉమాదేవి, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్కూల్ గేమ్స్

కలికిరి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం శారద ఆధ్వర్యంలో శుక్రవారం మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఉత్సాహంగా నిర్వహించారు. పోటీలలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మహల్(తెలుగు), మహల్ (ఉర్దూ), టి.చదివేవాండ్లపల్లి జెడ్పీహెచ్ఎస్, ఏపీఎంజేపీ బాలికల గురుకుల పాఠశాల, ఇండియన్ పబ్లిక్ స్కూల్, గడి ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి 152 మంది విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక సర్పంచ్ ప్రతాప్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై క్రీడా పోటీలను ప్రారంభించారు.

అభివృద్ధి చూసి ఆదరించండి

తంబళ్లపల్లె: నియోజకవర్గంలో అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని వైఎస్సార్‌సీపీని ఆదరించాలని మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి ప్రజలను కోరారు. శుక్రవారం మండలంలోని ఎర్రసానిపల్లె, పంచాయతీలలో సర్పంచులు సుగుణమ్మ, నాగేంద్రబాబు ఆధ్వర్యంలో పల్లెబాట కార్యక్రమం నిర్వహించారు. నాయకులు, అధికారులు ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని, కొన్నింటిని అక్కడే పరిష్కరించారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి రోడ్డుతో పాటు మౌలిక వసతులు కల్పించిన చరిత్ర వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిందన్నారు. మరోమారు సీఎం జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యేగా ద్వారకనాథరెడ్డిలను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సురేంద్రనాథ్, ఏపీఓ అంజనప్ప, ఏపీఎం గంగాధర్, నాయకులు మధూకర్‌రెడ్డి, భద్ర, కరీముల్లా, రమణారెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

వేరుశనగ రైతులను ఆదుకోవాలి

– ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక


రైతులకు రాయితీపై ఉలవలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

పెద్దమండ్యం: ఖరీఫ్‌లో వేరుశనగ పంట సాగు చేసిన రైతులను ఆదుకోవాలని ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులు వివరించారు. రైతులు 986 ఎకరాలలో వేరుశనగ పంటను సాగు చేసినట్లు ఏఓ సురేష్ తెలిపారు. సాగుచేసిన పంటను ఈ క్రాప్ ద్వారా నమోదు చేసినట్లు తెలిపారు. తీవ్ర వర్షాభావంతో పంట దిగుబడి వచ్చే పరిస్థితి లేదని అన్నారు. ప్రభుత్వం ద్వారా పంట సాగుచేసిన రైతులకు పెట్టుబడి రాయితీ, పంటల బీమా కోసం ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిపారు. పంట సాగుచేసి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఎంపీపీ కోరారు. రైతులకు ప్రత్యామ్నాయంగా రాయితీపై ఉలవలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మండలంలో వ్యవసాయ సర్వీసుల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సహకారంతో 686 మందికి ట్రాన్స్‌ఫార్మర్లు పంపణీ చేసినట్లు ఏఈ శంకర్‌రెడ్డి తెలిపారు. గడపగడపకు మనప్రభుత్వం, పల్లెబాట కార్యక్రమంలో వచ్చిన సమస్యలను పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. హౌసింగ్ ద్వారా మండలంలోని 17 గ్రామ పంచాయతీలలో 1800ల మందికి పక్కాగృహాలు మంజూరు కాగా రూ. 14.50 కోట్లు చెల్లించినట్లు ఏఈ సందీప్ తెలిపారు. పీఆర్ ద్వారా గ్రామీణ రోడ్లు, సిమెంటు రోడ్ల నిర్మాణం పనులు చేపట్టినట్లు ఏఈ షాబాజ్ తెలిపారు. పెద్దమండ్యం, బండమీదపల్లె, కలిచెర్ల జగనన్న లే అవుట్‌లలో మరికొంత మంది లబ్ధిదారులకు ఇంటిపట్టాలు ఇవ్వాలని సర్పంచ్‌లు కోరారు. పశునష్ట పరిహారం పథకం ద్వారా 125 మంది పాడి రైతులకు నష్టపరిహారం అందజేసినట్లు వెటర్నరీ డాక్టర్ తెలిపారు. అనంతరం రాయితీపై ఉలవలను రైతులకు ఎంపీపీ, జెడ్పీటీసీలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాము, ఎంపీడీఓ శ్రీధర్‌రావు, ఎండీసీ అధ్యక్షుడు గుర్రం రమేష్, సర్పంచ్‌లు మొలక బయ్యారెడ్డి, సోదనపల్లె బాషా, జింకా విశ్వనాథ, కంటి విశ్వనాధరెడ్డి, ఎంపీటీసీలు రుక్మాంగధరెడ్డి, ఎం. జయరాం, వై నరసమ్మ, శారదమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు పెంచడమే లక్ష్యం


బైజూస్ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పీలేరు : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా ట్యాబ్‌ల ద్వారా బైజూస్ యాప్ అందుబాటులోకి తెస్తున్నట్లు జిల్లా నోడల్ అధికారి సుధాకర్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బైజూస్ యాప్ వాడకంపై నియోజకవర్గ స్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటీపీ విధానంతో విద్యార్థులు ఇతర యాప్‌లు వాడకుండా నిరనోధించవచ్చునని తెలిపారు. ఉపాధ్యాయులు బాధ్యతతో విద్యార్థుల ట్యాబ్‌లు సరిచేసి బైజూస్ యాప్ ద్వారా నాణ్యమైన విద్య అందేటట్లు చూడాలన్నారు. ట్యాబ్‌లను ప్రతి శుక్రవారం ఇంటర్‌నెట్ కనెక్ట్ చేస్తే ఆటోమెటిక్‌గా అప్‌డేట్ అవుతాయని తెలిపారు. అనంతరం విద్యార్థులతో ట్యాబ్‌ల వినియోగంపై ముఖాముఖి మాట్లాడారు. పలు రకాల సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ నోడల్ అధికారి అశోక్‌రెడ్డి, ఎంఈవోలు లోకేశ్వర్‌రెడ్డి, హెచ్‌ఎం వి.జి. నటరాజన్ పాల్గొన్నారు.

పీఎంఈజీపీ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న బోదేషావలి

పీలేరు : కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రధానమంత్రి ఉపాధి కల్పన (పీఎంఈజీపీ) పథకాన్ని భవన నిర్మాణ కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యులు బోదే షావలి కోరారు. శుక్రవారం స్త్రీశక్తిభవన్‌లో పీలేరు, కేవీపల్లె, కలికిరి మండలాలకు చెందిన భవన నిర్మాణ కార్మికులకు పీఎంఈజీపీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వశాఖ అందిస్తున్న ఈ పథకం ద్వారా స్వయం ఉపాధి యూనిట్ల స్థాపనకు సహాయం అందుతుందన్నారు. ఉపాధి యూనిట్లకు గరిష్ఠంగా రూ. 20 లక్షల వరకు రుణం ఇస్తుందని తెలిపారు. ఈ పథకానికి 18 సంవత్సరాలు వయస్సు పైబడి కనీసం 8వ తరగతి విద్యార్హత కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో బలరాం, వెంకటేష్, మోదీన్‌బాషా, ఆనంద, రహంతుల్లా, చంద్ర, రెడ్డెప్ప పాల్గొన్నారు.

ఆయిషాను స్ఫూర్తిగా తీసుకోవాలి


గ్రూప్-1 విజేత ఆయేషాను అభినందిస్తున్న పీకేఎం-ఉడా వైస్‌చైర్మన్ బాబర్

మదనపల్లె : పేద కుటుంబంలో పుట్టి పట్టుదలతో చదివి డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన షేక్ ఆయిషాను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకుని తనలాగే ఉన్నతస్థానాలకు ఎదగాలని పలమనేరు, కుప్పం, మదనపల్లె అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(పీకేఎం-ఉడా) వైస్ చైర్మన్ బాబర్ అన్నారు. శుక్రవారం కొత్తపల్లె పంచాయతీ ఈశ్వరమ్మకాలనీలో నివాసం ఉంటున్న ఏపీపీఎస్సీ గ్రూప్-1 విజేత, డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన షేక్ ఆయేషాను ఉడా వైస్‌చైర్మన్ కలిసి పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలిపారు. ఎన్ని ఇబ్బందులెదురైనా మొక్కవోని దీక్షతో కుమార్తెను ప్రయోజకురాలిగా తీర్చిదిద్దిన ఆయేషా తల్లిదండ్రులు షేక్ అహ్మద్ బాషా, గౌసియాబేగంలను అభినందించారు. ఈ సందర్భంగా బాబర్ మాట్లాడుతూ...షేక్ ఆయిషా విజయం పేద మైనారిటీ పిల్లలకు స్ఫూర్తిదాయకం కావాలన్నారు. మైనారిటీ ఆడపిల్లలు ఇప్పుడిప్పుడే చక్కగా చదువుకుంటూ మంచి ఫలితాలు సాధిస్తున్నారన్నారు. తల్లిదండ్రులు చదువు విషయంలో ఆడపిల్లలకు అండగా నిలిచి, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా అధిగమించాలన్నారు.